షాలిని

ఏ. వీ. మోహన్రావ్

ఆమెను చూడటం అదే మొదటిసారి. అందం అంటే ఏమిటో ఆమెని చూసి తెలుసుకున్నాను. నెమలి రంగు కళ్ళల్లో కామం మాత్రమే కాదు, ఎవరన్నా భయపడనట్లుండే తెగింపుతనం కూడా కొట్టొచ్చినట్లు కనుపించాయి.

"మార్నింగ్! మిస్టర్ కరణ్" అంటూ వచ్చి కూర్చుంది ఎదురుగా వున్న కుర్చీలో.

"మార్నింగ్! మిస్..." ఆమె పేరు తెలీక ఆగిపోయాను.

"షాలిని" అంది.

"మీలాగే పేరుకూడా అందంగా వుంది" అన్నాను.

నిజమా అన్నట్లు కళ్ళెత్తి నాకేసి సూటిగా చూసి,

అంతలోనే దించుకుంది.

"ఇంతకూ మీకేం కావాలి?" అడిగాను నేనే.

"మిమ్మల్ని చూసి వచ్చిన పనికూడా మరచిపోయాను" అంటూ హ్యాండ్‌బ్యాగ్ తెరచి అందులోనుండి బంగారు వుంగరం తీసి టేబుల్ పైన పెట్టింది. దానికేసి చూశాను. నా ముందుకు తోసింది. "దీనికి మంచి ఖరీదైన వజ్రం కావాలి. దొరుకుతుందా?"

"ఎంత ఖరీదులో కావాలి!"

"లక్షదాకా ఫరవాలేదు."

"అంత ఖరీదయిన దయితే కొద్ది రోజులు ఆగాల్సి వుంటుంది. పాతిక వేలు పైన ఖరీదుచేసే వజ్రాలు ప్రస్తుతం మా దగ్గర స్టాకులో లేవు" అన్నాను.

"ఈ సిటీలోనే కాదు, ఈ దేశంలోనే, మీ షాపుకు మించిన పెద్దషాపు, మిమ్మల్ని మించిన పెద్ద డైమండ్ ఎక్స్‌పర్ట్ లేడని విన్నాను. మరి మీ దగ్గరకూడా చెత్త రాళ్ళు తప్ప మంచివి వుంటున్నట్లు లేదు" అంది షాలిని.

నా కామె మాటలకు కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాను. జవాబు చెప్పకుండా ఆమె అందమైన అవయవముల కేసి చూస్తూ కూర్చున్నాను.

"మరో షాపులో ఎక్కడైనా దొరుకుతుందా?" ముందుకు వంగి గడ్డం టేబుల్ పైన ఆన్చి అడిగింది.

"దొరకదు! మాక్కూడా విదేశాల్నుంచి వస్తాయి. వారం రోజుల్లో స్టాకు వస్తుంది. మీ అడ్రసు రాసివ్వండి. ఉత్తరం ద్వారా తెలియపరుస్తాను" అన్నాను ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"థాంక్స్! మీకు పెళ్ళయిందా?" ఉన్నట్టుండి అడిగింది.

"ఏం?" అన్నాను ఆశ్చర్యంతో.

5

"మీరు నన్ను చూసే తీరును చూస్తే పెళ్ళి కాలేదని ఖచ్చితంగా అనిపిస్తూంది. ఆడవాళ్ళకేసి అలా ఆరాటంగా, నమిలి మ్రింగేటట్లు చూడటం మానుకోండి!" అంది షాలిని.

"వజ్రాలైనా, వనితలైనా, సురేనా అందాన్ని చూసి ఆనందించడమే కాదు, ఆరాధించడంకూడా నాకో పెద్ద బలహీనత" అన్నాను నా ప్రవర్తనను నేనే సర్ది చెప్పుకుంటూ.

"అన్నింటి సంగతీ నాకు తెలీదు. వనితల సంగతి మాత్రం తెలుసు. వాళ్ళకు మనసు లుంటాయి. అవి మిమ్మల్ని చూస్తుంటాయి. అదిమాత్రం మరచిపోకండి" అంది గోముగా.

"సో! యూ లైక్ మీ!" అడిగాను ధైర్యంచేసి. అదే నేను చేసిన పొరపాటు. అక్కడే నా జీవితం మలుపు తిరిగింది. అంతకు ముందుదాకా, నిండుగా నీరున్న కోనేటిలా ప్రశాంతంగా వున్న బ్రతుకులో కలతలు రేగాయి. కారుమేఘాలు క్రమ్మాయి. కారుచిచ్చులు రగిలాయి.

"ష్యూర్! కానీ లైకింగ్ ఎక్కువగా వుండాలంటే ఇంకొన్ని వివరాలు కావాలి!" అంది పకపక నవ్వుతూ.

"అడగండి! చెపుతాను."

"మీ కెన్నేళ్ళు?"

"ముప్పయి ఐదు!"

"ఎంత జీతం?"

"మూడు వేలు!"

"బ్యాంక్‌లో ఎంత డబ్బుంది?"

"నాదాపు ఎనభై వేలుంది. చిన్న బంగళా వుంది, మెర్సిడెస్ బెంజ్ కారుంది. బంగళాలో ఎయిర్ కండి

షన్ చేసిన బెడ్ రూం వుంది. అందులో చిన్న బార్ కూడా వుంది'' అన్నాను.

''నీకున్నవన్నీ చాలామందికి వున్నాయి. అలాంటి వాళ్ళు నావైపు కన్నెత్తి చూడటంకూడా నేను సహించను. యూ హావ్ వేస్టెడ్ మై టైమ్. వజ్రాలు రాగానే ఫోన్ చేసి చెప్పు. ఇదీ నా అడ్రసు. వస్తాను'' అంటూ తెల్లటి చిన్న విజిటింగ్ కార్డు నా టేబుల్ పైన పడేసి చకచక వెలుపలికి వెళ్ళిపోయింది.

అలా చూస్తూ కూర్చున్నాను అచేతనంగా, అవాక్కయి అయిదునిముషాలు.

ఆమెపైన నాకు కోపం, అసహ్యం కలిగాయి. ఈ దేశంలోవున్న బ్రహ్మచారుల్లో దాదాపు తొంభై అయిదు శాతంకన్నా మంచి పొజిషన్లో వున్నాను నేను. అయినా ఆమె నన్ను హేళనచేసి, చిల్లిపెంకు కొరగానన్నట్లు చెప్పి పోవడం తలచుకొంటే ఒక రకమైన పంతం రేగింది. ఎలాగైనా సరే ఆమె నోటితోనే 'ఐ లైక్ యూ!'' అని చెప్పించుకోవాలి.

2

షాలినిని ఎంత మరచిపోవాలనుకున్నా ఆమెను గుర్తు తెచ్చుకోవడం మానలేకపోయాను. ఆమె అందమైన అవయవాలు, చిలిపినవ్వు, క్రూరమైన కామవాంఛ, నన్ను ఆమె దగ్గరకు లాగసాగాయి.

స్టాండుపైనున్న కోటుతీసి ఆమె ఇచ్చిన కార్డు వెలుపలకు లాగాను. అడ్రసు చదువుకున్నాను. ఫోన్ కూడా వుంది. ఓమారు ఫోన్ చేసి చూద్దామని ఆ కార్డు చేత్తో పట్టుకుని కార్నర్ స్టూల్ వద్దకు నడిచాను. దాన్ని చూస్తూ మెల్లగా డయల్ చేశాను.

''హల్లో!'' అంటూ బొంగురు మగగొంతు వినిపించింది.

"హల్లో! నేను కరణ్‌ను మాట్లాడుతున్నాను" అన్నాను.

"ఎవరో నాకు తెలీదు! నీ కెవరు కావాలి?" అడిగాడు అవతలివేపు మాట్లాడుతున్న వ్యక్తి మాటలు అంటు న్నట్లుగా నవ్వుతూ.

"షాలిని!" చెప్పాను.

"ముక్కుదాకా త్రాగి, ఒంటిమీద స్పృహలేకుండా గదికి అడ్డంగా పడివుంది. వచ్చి చూడు కావాలంటే. నామాట అబద్ధంకాదు. విస్కీమీద ఒట్టు!" అన్నాడు అతను. అప్పటికి అర్థమయింది అతను సగం త్రాగిన మత్తులో ఉన్నాడని.

"నువ్వెవరు?" అడిగాను.

"తెలీదు! కానీ అమ్మకు షాలిని నా తర్వాత పుట్టిం దట!" అన్నాడు.

విని నవ్వుకొని ఫోన్ కట్ చేశాను.

అల్మైరా తెరచి ఆఫ్ కలర్ సూట్ తీసి తెల్లచొక్కా వేసు కున్నాను. ఎర్రటి వెడల్పాటి టై కట్టుకొని బూట్లు తొడుక్కున్నాను. ఖరీదైన సెంట్ పులుముకున్నాను.

బంగళాకు తాళంవేసి మెర్సిడెస్ కారెక్కాను. చేతి కున్న సీకోవాచీ గంట పదకొండయినట్లు చూపించింది. కరన్‌జ్ రోడ్ చేరేదాకా స్పీడుగా వెళ్లాను. రోడ్‌లోకి రాగానే స్లో చేసి ఇళ్ల నెంబర్లు చూసుకుంటూ నడిచాను.

అరవైఆరో నెంబరు లేదు. ఆ యింటికి కాంపౌండ్ వాల్ గానీ, గేటుగానీ లేవు. రోడ్‌కు దూరంగా పాత మేడవుంది. గోడలకున్న పెచ్చులు ఊడిపున్నాయి. రక రకాల పిచ్చిచెట్లు అడ్డదిడ్డంగా పెరిగివున్నాయి ఇంటి ముందు.

కారు రోడ్‌లోనే పార్క్ చేసి, దిగి నడచి ఇంటివేపు

వెళ్లాను. పోర్టికోలో ఎర్ర మోటార్ సైకిల్ వుంది. వెనుక వైపునుండే చక్రం ప్రక్కనున్న పెట్టెమూత తెరచివుంది. అందులో లావుపాటి కర్ర కొట్టొచ్చినట్లు కనుపించింది.

మోటార్ సైకిల్ వెనుక నాలుగు, ముందు నాలుగు లైట్లు వున్నాయి. అవికూడా రకరకాల రంగుల అద్దాల వెనుక బిగించి వున్నాయి.

తలుపుల దగ్గరో మనిషి కళేబరం అడ్డంగా పడివుంది. నా కాలు అతని పొట్టభాగంమీద పడగానే "ఎవరది?" అన్నాడు పైకి లేవకుండానే.

"నేను!" అన్నాను.

"లోపలికిపోకు! ఈ సిటీకల్లా పెద్ద రౌడీ కిశోర్ సింగ్ లోలానున్నాడు" అన్నాడు ప్రక్కనున్న బ్రాందీ సీసా అందుకుని నోటిదగ్గర పెట్టుకుంటూ. షాలిని అన్న వీడే అయివుంటాడని ఊహించుకున్నాను.

"అత నెందుకొచ్చాడు!" అడిగాను నేను.

"వారంవారంవచ్చి షాలినిపైన తనకున్న ప్రేమంతా వెళ్ళబోస్తాడు. అది చెప్పుతో కొట్టి పంపిస్తుంది. అంతే!" అన్నాడు. త్రాగినా అతను బాగానే మాట్లాడుతున్నందుకు నాకు ఆనందం కలిగింది.

"షాలిని అతన్ని ప్రేమించడంలేదా?"

"దానికి ప్రేమంటే తెలుసుననుకుంటున్నావా? ఐతే నువ్వు పిచ్చివాడివై ఉండాలి! తన్ను తప్ప, మరెవ్వరినీ ప్రేమించదు. డబ్బుమీద తప్ప మరో దేనిపైనా ఆమెకు మోహంలేదు! తెలుసుకో!" అన్నాడు.

అతన్ని తప్పించుకుని లోనికి అడుగుపెట్టాను. ఎదురుగుండా షాలిని అర్ధనగ్నంగా వుంది. ఆమెముందు ఆరడుగుల అజానుబాహువు విగ్రహం నిలబడివుంది. బాగా బలంగా ఉన్నట్లుంది అతని ఆకారం. వాళ్ళిద్దరూ ఏదో

ఘర్షణ పడుతున్నారనిపించింది. మాటలు ఆగిపోయాయి. కిశోర్ సింగ్ షాలిని పైకి పులిలా దుమికాడు. ఆమె జుట్టు పట్టుకుని గుంజాడు. షాలిని క్రిందపడింది. ఆమె పొట్టపైన కూర్చుని మోకాలు గడ్డం క్రింద పెట్టి నొక్క సాగాడు.

నా కా సీను చూచి భయం, కోపం, ఒక్కసారిగా వచ్చాయి. ఒక్క ఊపుతో వెళ్లాను కిశోర్ సింగ్ వేపు. ఆమెమీదున్న సింగ్ ఎగిరి నాపైన పడ్డాడు. అతని బరువును తట్టుకోలేక నేను క్రిందపడిపోయాను.

“స్కౌండ్రల్! అందరిలాంటి ఆడదనుకున్నావా? పైన చెయ్యివేశావంటే చంపుతాను” అంది అప్పుడే లేచి నిలబడ్డ షాలిని.

సింగు నాకేసి చూశాడు. నేనెవ్వరో అతనికి అర్థం కాలేదు. నన్నూ, షాలినిని, మార్చిమార్చిచూసి, నన్ను చావగొట్టడం మొదలెట్టాడు. షాలినివచ్చి సింగును తోసి వేసింది. అప్పటికే నావళ్ళు హూనమయింది. నోటిగుండా చొంగ కారింది. వెల్లకింతలాపడిపోయాను. స్పృహకూడా పోయింది.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి గోధుమరంగు చీర జాకెట్ లో ఉన్న షాలిని గ్లాసులో నీళ్ళు అందిస్తూ కనుపించింది.

“నే నెక్కడున్నాను?” అడిగాను భయంగా.

“ఇక్కడే ఉన్నారు. ఈ నీళ్ళు త్రాగండి!” అంది.

లేచి కూర్చుని గ్లాసుడునీళ్ళు గడగడ త్రాగేశాను.

“వాడేమయినాడు?” చుట్టూ చూశాను.

“తన్ని తరిమేశాను. అయినా ఏం మగాడివి! అతను అలా తంతూంటే బిక్కురుమనకుండా వేడివేడి పకోడీలు తిన్నట్టుగా తిన్నావ్?” అంది షాలిని నవ్వుతూ. ఆమె సన్నటి తెల్లటి పళ్లవరస కనుపించింది. ఆ నవ్వే నా ప్రాణాలు తీసింది, నన్ను పిచ్చివాణ్ని చేసింది.

"అతన్ని నేను ఎదుర్కోగలనన్న ధైర్యం లేక పోయింది!" అన్నాను సిగ్గుతో తలవంచుకుంటూ.

"నాన్సెన్స్! ఆడదాన్ని! నేను హాండిల్ చెయ్యగా నువ్వు చెయ్యలేవా? అసలింతకూ నా ఇంటికి నువ్వెందు కొచ్చినట్లు" అడిగింది షాలిని.

"నిన్ను చూడాలనిపించింది వచ్చేశాను" అన్నాను మెల్లగా.

"కిశోర్ సింగ్‌ను తెలుసా?" అడిగింది షాలిని.

"తెలీదు. మీ తాగుబోతు అన్నయ్య చెపితే విన్నాను. ఈ వూళ్ళోకల్లా పెద్ద రౌడీ అట!"

"అటకాదు! నిజం. ఇప్పటికి నాలుగైదు హత్యలు చేశాడని వినికిడి. వాడు నన్ను ప్రేమిస్తున్నాడు. వాడి కున్నపాటి ధైర్యం, తెగింపు, సాహసం కూడా లేవు నీకు. నిన్నెలా ప్రేమించేది" అడిగింది.

"అలాంటి వాళ్ళంటే నీకు ఇష్టమా!"

"లేదు! అంతకన్నా ఇంకా పెద్ద రౌడీయో, దొంగో, హంతకుడో అయితే తప్ప ఇష్టపడను" అంది షాలిని.

"ప్రెచురస్! అదేం విపరీతపు కోరిక నీకు?" అయోమయంగా చూస్తూ అడిగాను.

"కోరిక కాదు! టేస్ట్! నువ్వు పనికిరావని తెలిసిందిగా. వెళ్ళు" అంది.

నాకు అనుమానం వేసింది. జీవితంలో ప్రేమంటూ పుట్టింది షాలినిపైనే నాకు. ఆమెను ఎలాగైనా పొందా లన్న తపన ఎప్పుడో కలిగింది. నిర్ణయం చేసుకున్నాక సాధించకపోవడం అనేది నేనెరుగను. నాది మంకుపట్టు.

"వెళ్ళను!" అన్నాను.

"ఏం చేస్తావ్?"

"నన్ను పెళ్ళాడేందుకు నీచేత ఒప్పిస్తాను. మనిషిలో

అలాంటి రాక్షసప్రవృత్తి కావాలని నువ్వెందుకు కోరుకుంటావ్?"

"ఇది కలికాలం. మనుషుల్ని బ్రతకనివ్వదు. రాక్షసులు బ్రతకగలరు. ఆనందించగలరు. అందుకే రాక్షస కృత్యాలన్నా, రాక్షసులన్నా నాకు చాలా ఇష్టం."

"అయితే నీకోసం నేనూ రాక్షసుణ్ణవుతాను" అన్నాను రక్కున.

"నీ చేత కాదు!"

"అలాగనకు! నా తడాఖా చూపిస్తాను. ఆ తర్వాత నువ్వే అంటావ్ నీ అంత రాక్షసుడు నువ్వు తప్ప మరొకరు లేరని."

"చూద్దాం! ముందు నీ ప్రతాపం చూపించు" అంది నవ్వుతూ.

నేను లేచి గబగబ బట్టలు వేసుకొని వచ్చేశాను.

మరుసటి దినం ఎక్కడికీ పోకుండా ఇంట్లోనే విస్కీ త్రాగుతూ కూర్చున్నాను. నా రాక్షసకృత్యాల్ని ఎలా చెయ్యాలి. ఏం చేస్తే షాలిని నన్ను మెచ్చుకుంటుంది? రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. పోతున్నాయి, ఏదీ తేల్చుకోలేకపోయాను.

కిశోర్ సింగ్ గుర్తొచ్చాడు. వాడు నన్ను షాలినిముందు చావబాదాడు. పైగా ప్రేమలో నాకు ప్రత్యర్థి. అన్నింటినీ మించి వాడు పెద్ద రౌడీ, హంతకుడు. వాణ్ణి ఏడిపిస్తే, నన్ను వాణ్ణిమించిన రాక్షసుడిగా షాలిని గుర్తిసుంది. అందుకేం మార్గం వుందాని ఆలోచించాను. మెరుపులా మెరసింది ఐడియా.

3

రాత్రి పన్నెండయింది.

నల్లటి సూట్ వేసుకున్నాను. ఫెల్ట్ హాట్ పెట్టు

కున్నాను. గారేజీలోంచి ఐదులీటర్ల పెట్రోలు టిన్ను తీసి, సైఫను సాయంతో, కారుటాంకులోని పెట్రోలు దాన్నిండా నింపాను. టిన్ను తెచ్చి ముందుసీట్లో పెట్టుకొని, కారు స్టార్టుచేశాను.

కర్జన్ రోడ్ మొదట్లోవున్న మూడంతస్తుల పాత భవనం, కిశోర్ సింగ్ నివాసమని ఆ సాయంత్రమే తెలుసుకున్నాను. ఒక్కొక్క ఏరియాకు ఒక్కొక్క రౌడీ వుంటాడు. రోజూ రాత్రి పన్నెండు గంటలకు అంతా కిశోర్ సింగ్ దగ్గరకు వస్తారని తెలుసుకున్నాను. తమ నాయకుడికి ఇవ్వవలసిన వాటా మొత్తం ఇచ్చి, కాసేపు త్రాగి, పేకాడి, వేకువఝామున వెళ్ళిపోతూండడం రివాజనికూడా కనుక్కున్నాను.

కారును కర్జన్ రోడ్ కు ముందుగానే ఆపేశాను. లాక్ చేశాను. పెట్రోలు టిన్ను చేత్తోపట్టుకుని పేవ్ మెంట్ మీద చెట్లనీడల్లోపడి ఎవరికీ కనుపించకుండా నడచి పోయాను.

దూరంనుంచే కిశోర్ సింగ్ ఇంటికేసి చూశాను. వరుసగా ఎర్రటి మోటార్ సైకిల్స్ ఒకదానిప్రక్క నొకటి పార్క్ చేసి వున్నాయి. అడుగులో అడుగువేసుకుంటూ వెళ్లాను. ఎవరూ జనం తిరగటంలేదు. డబ్బామూత తీశాను. అన్నింటిమీద పెట్రోలు చిలకరించాను. అప్పుడే వాటిని లెఖపెట్టాను. మొత్తం ఇరవై రెండున్నాయి. డబ్బా కూడా ఒక సైకిల్ పైన పెట్టాను.

సిగరెట్ వెలిగించుకొని లయిటర్ ఆర్పి జేబులో వేసుకున్నాను. కాలుతున్న సిగరెట్ దూరంనుండి వడిసెల్లో రాయిలా మధ్య వేలుకు, చూపుడువేలుకు నడుమ ఇరికించి బలంగా విసిరాను. వెళ్ళి మోటారుసైకిళ్ళపైన పడగానే గుప్పున ఆకాశమెత్తున మంటలేచింది.

"మంటలు! మంటలు!" అంటూ అందరూ పరుగెత్తు కుని రావడం మొదలెట్టారు. వాళ్ళమధ్యనుండి నేను మెల కువగా తప్పించుకుని వచ్చేశాను కారు దగ్గరకు. ఎక్కి కూర్చున్నాను. స్టార్టు చేసి ఐదునిముషాల్లో ఐదు కిలోమీటర్లు దాటాను.

పబ్లిక్ బూత్ నుండి ఫైర్ సర్వీసుకు ఫోన్ చేసి ఆక్సి డెంటు గురించి చెప్పి వెంటనే హెల్పు పంపమన్నాను. నా పేరడిగారు. చెప్పకుండానే లైను కట్ చేసి,తిన్నగా బంగళాకు వెళ్ళిపోయాను.

కారు గారేజీలో పెట్టి తాళం వేసుకుని, బంగళా తాళంతీసి లోనికెళ్ళి కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడు క్కొని వచ్చి మంచంమీద పడుకున్నాను.

నా జీవితంలో ఎప్పుడూ చిన్న నేరం చెయ్యలేదు. అలాంటిది ఇంత పెద్ద ఘోరం ఒంటరిగా, ధైర్యంగా, చేసి వచ్చాను. తలచుకొని భుజాలు పొంగిపోయాయి. కిశోర్ సింగ్, వాడి అనుచరులు ఎటూ కదలకుండా చేసినందుకు ఆనందం కలిగింది. నాలో మంచిమనిషి చచ్చాడనీ, రాక్ష సుడు అవతరించాడనీ నా కప్పటికి అర్థంగాలేదు.

గంట తర్వాత ఫోన్ మ్రోగింది.

రిసీవరెత్తి "హల్లో! కరణ్ హియర్! ఎవరు?" అడి గాను.

"షాలిని!" అంది అవతలివైపు నుండి.

"నువ్వా? ఏమిటి?"

"నీ అంత నీచుడ్ని ఇంతకుముందెప్పుడూ చూడలేదు!" అంది.

"ఎందుకలా అంటున్నావ్?"

"కిశోర్ సింగ్ ఇంటిముందు జరిగిన ఘోరం నువ్వే కదూ చేసింది!"

"గుడ్! బాగానే గెస్ చేశావ్! అవును నేనే!"

"అలాంటి చాటుదెబ్బలు తీసే మనుషులంటే నా కసహ్యం. ధైర్యంవుంటే ఎదురుగా పోరాడు. గెలువు. మెచ్చుకుంటాను" అంది షాలిని.

"నాన్సెన్స్! రాక్షసులు ఎదుటపడి పోరాడరు. ఎలా పోరాడా డన్నదికాదు ముఖ్యం! పోరాటం యొక్క ఫలితం!" అన్నాను.

"నీ సంగతి కిశోర్‌సింగ్‌కు తెలిస్తే ఏం చేస్తాడో తెలుసా?"

"భయపెడుతున్నావా? సారీ! నేను భయపడను. నిన్ను ప్రేమించకముందు, నువ్వు నాకు కావాలని కోరుకోకముందు, సొసైటీలో స్టేటస్ కోసం, మంచివాడిననిపించు కొనేందు కోసం, అయిష్టంగా వున్నా, మంచిగా ప్రవర్తించే వాణ్ణి. ఇప్పుడా పద్ధతి మానేశాను. కిశోర్‌కు చెప్పిచూడు. ఏమవుతుందో చూద్దుగానీ!" అంటూ ఫోన్ కట్ చేసి క్రింద పడేశాను.

4

నాలుగు గంటల ప్రాంతంలో కారు ఏదోవచ్చి బంగళా ముందాగిన శబ్దమయింది. నాకు తెలుసు వచ్చిందెవరో? నేను క్రింద హాల్లో విండో కర్టెను వెనుక నక్కి దాక్కు న్నాను. తలుపుతట్టి పిలుస్తారని ఎదురుచూశాను. ఎవ్వరూ తట్టలేదు. నేను పడకగదిలో వున్నాననుకుని డ్రెయిన్ వాటర్ పైపు సాయంతో పైకెక్కి, బెడ్‌రూం కిటికీగుండా లోపలకు దూరుతారని ఊహించాను. వెళ్ళి పైకి వెళ్లేందుకు వున్న మెట్ల మొదట్లో నిలబడ్డాను చేతిలో మెషిన్‌గన్ పట్టుకుని.

బెడ్‌రూంలోంచి తుపాకీ గుండ్లు పేలిన చప్పుడయింది. మనిషిలా దిండ్లను తయారుచేసి మంచానికి అడ్డంగా

పెట్టె పైన దుప్పటికప్పి వచ్చాను. నేనే వున్నాననుకుని వాళ్ళు కాల్చివుండాలనిపించింది.

"మోసం మోసం!" అంటూ పైనుండి కేకలు వినిపించాయి.

నేను గన్ గురిపెట్టి స్టడీగా నిలుచున్నాను. పైవేపు మెట్లు మొదట్లోకి కిశోర్ సింగ్ వచ్చాడు. అతని వెనుక ఇద్దరు అనుచరులున్నారు.

"సుస్వాగతం! రండి! దిగిరండి!" అన్నాను వాళ్ళకే గురిపెట్టి.

గుడ్లు తేలవేశారు ముగ్గురూ.

"ముందు మీ దగ్గరున్న ఆయుధాలు క్రిందకు విసిరి వెయ్యండి. క్విక్. లేకుంటే కాకుల్ని కాల్చినట్లు కాల్చి చంపుతాను" అన్నాను.

అందరూ బిక్కచచ్చిపోయారు. గన్స్ క్రిందకు విసిరారు. కిశోర్ గురచూసి నా చేతిలోవున్న గన్ కేసి కొట్టబోయాడు. నేను తప్పించి, అతని కాలి మడమలో తగిలేట్లుగా గుండు పేల్చాను. కక్కున క్రిందపడ్డాడు. అతని అనుచరులిద్దరూ అలాగే చేతులు పైకెత్తుకుని రాతి బొమ్మల్లా నిలబడ్డారు.

మెల్లగా ఒక్కొక్క మెట్టే పైకెక్కాను. పొడవుపాటి నూలుత్రాడు వాళ్ళపైకి విసిరాను. కిశోర్ కాళ్ళు చేతులు కట్టమన్నాను. అలాగే చెప్పినట్లు చేశారు. మిగిలిన ఇద్దర్నీ గోడవేపు మొహాలుపెట్టి, ఆనుకుని నిలుచోమని అరచాను. చెప్పినట్లు చేశారు. వాళ్ళ కాళ్ళు, చేతులు ఇంకో త్రాడుతో కట్టేశాను.

ముగ్గుర్ని క్రిందకు లాక్కొచ్చి కార్లో బ్యాక్ సీట్‌లో త్రోసి, షాలిని ఇంటివేపు పోనిచ్చాను. అరగంటలో ఆమె ఇంటిముందుకు వెళ్ళి ఆగింది కారు. తలుపు బూటుకాలితో

తన్నాను.

తెరుచుకున్నాయి తలుపులు. ఆమె అన్నగారు "ఎవరు?" అని అడిగాడు.

"కరణ్! షాలినేది?" అడిగాను.

"పిలుస్తాను. కానీ నా లంచం ఏదీ!" అన్నాడు.

కోటుజేబులోంచి క్వార్టర్ బాటిల్ బ్రాందీ ఇచ్చాను. అందుకొని, ఆనందంగా ఈల వేసుకుంటూ వెళ్ళాడు. రెండు నిముషాల తర్వాత షాలిని వచ్చింది. నన్ను చూసి ఆశ్చర్యపోయింది.

"నువ్వా?" అంది.

"ఏం? ఈపాటికి ఆ సింగ్ గాడు నన్ను యమలోకం పంపి వుంటాడనుకున్నావా?" అడిగాను కోపంగా.

"కాదు?" అంది తలవంచుకొని.

"బుకాయించకు. నువ్వే వాళ్ళకు నా గురించి చెప్పావ్. వాళ్ళని తీసుకొచ్చాను. చూద్దువుగాని రా?" అంటూ రెక్క పట్టుకొని బడబడ వెలుపలకు ఈడ్చుకు వెళ్ళాను. బాక్ డోర్ తెరచి, ముగ్గుర్నీ బయటకులాగాను. వాళ్ళు జారి క్రిందపడ్డారు.

"నువ్వొక్కడివేనా ఈ ఘనకార్యం చేసింది?" అడిగింది షాలిని.

"అవును! కావాలంటే వాళ్లనే అడుగు" అన్నాను గర్వంగా.

వాళ్ల కట్లిప్పి తరిమేసింది షాలిని. పిక్కలబలం చూపించారు. నవ్వుకున్నాను. "లోపలకి వెళ్దాం!" అంది షాలిని.

నాకు ఆకాశంలో అందకుండా గాలికి పరుగె త్తికొని పోయే తెల్లమబ్బుపైన ఎక్కి కూర్చున్నట్లుగావుంది ఆమె పిలుపు. వెంట వెళ్ళాను.

రెండుగ్లాసుల్లో విస్కీపోసి "ఫార్ అవర్ లవ్!

ఛీర్స్!" అంటూ గ్లాసులు ఠంగుమని మ్రోగించి నాకో గ్లాసిచ్చింది. ఇద్దరం మెల్లగా త్రాగసాగాం. సిగరెట్ ముట్టించుకున్నాను.

"ఐ లవ్ యూ! కానీ నిన్ను లైక్ చెయ్యలేకపోతున్నాను" అంది షాలిని.

"ఎందుకని?" అడిగాను.

"నీదగ్గర డబ్బులేదు! ముందది సంపాదించే సులభమైన మార్గం చూడాలి. నాకు చాలీచాలని జీవితమంటే అయిష్టం" అంది.

"దాదాపు లక్షరూపాయలున్నాయి.ముందే చెప్పాను" అన్నాను.

"అదేమూలకు. మనిద్దరం కాశ్మీర్ కు హనీమూన్ కు వెళ్ళేందుకూ కూడా చాలదు" అంది షాలిని.

ఆమె మాటల్లోని నిజం నాకర్థమయింది. నా జీవితంలో ఖర్చులు జాగ్రత్తగా పెట్టుకొంటూ, పొదుపు చేసి మిగిల్చిన మొత్తమది. కానీ పట్టుమని పదినాళ్ళ హనీమూన్ ట్రిప్ కు అది చాలేట్లులేదు.

"నువ్వు చెప్పింది కరెక్ట్! కాస్త టైమివ్వు. ఏదైనా పథకం ఆలోచిస్తాను" అన్నాను. "నో అర్జెన్సీ! నిదానంగానే జరగనీ. ఈ క్షణంనుండి నేను నీదాన్ని. ఆవిషయం మరచిపోకు. కానీ నన్ను నీవు అనుభవించేదిమాత్రం హనీమూన్ లోనే! అదీ గుర్తించుకో!" అంది షాలిని.

ఆనందం పొంగులెత్తింది. ఆకాశం చెంగున దుమికింది గుండెల్లో. ఆమెను నా బాహుబంధంలో ఘట్టిగా అదుముకున్నాను. ఆమె ఎత్తులు, పల్లాలు, అవయవాలసొంపులు, సోయగాలు నా శరీరంలోని ప్రతి అణువుకూ తగిలాయి. బ్రాందీని మించిన మత్తు పుట్టుకొచ్చింది నాకు. ఆమె

మెల్లగా నా కౌగిలి వదలించుకొని దూరంగా పోయింది. నేను వెలుపలికొచ్చి కారెక్కి బంగళాకు దారితీసాను.

5

ఆ తర్వాత మూడ్రోజులు డబ్బు సులభంగా సంపాదించే మార్గమేమన్నా ఉంటుందాని ఆలోచించడంతోనే సరిపోయింది. రెండుసార్లు షాలిని ఫోన్ చేసింది. నేను మూడుసార్లు ఫోన్లో ఆమెతో మాట్లాడాను. ఆఫీస్‌కు లీవ్ పెట్టి ఇంట్లోనే ఉన్నాను.

కిశోర్ సింగ్ చేతిలో చావుదెబ్బలుతిన్న పెద్ద పెద్ద రౌడీలు నలుగురైదుగురు వచ్చారు. కలుసుకుని నేను చేసిన ఘనకార్యానికి మెచ్చుకున్నారు. వాళ్లను వదిలించుకోవడం పెద్దసమస్యయిపోయింది నాకు.

ఎన్ని ఆలోచనలు చేసినా, డబ్బు సులభంగా దొరికే మార్గం కనుపించడంలేదు నాకు. అదిలేనిదే షాలిని నాకు దక్కదు.

ఐదోరోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఫోన్ మ్రోగింది. బహుశా షాలినయి వుండవచ్చుననుకుంటూ రిసీవరెత్తాను.

"హల్లో! కరణ్ స్పీకింగ్!" అన్నాను.

"హౌ ఆర్ యూ! నేను ఖాన్‌ను మాట్లాడుతున్నా" అన్నాడు బాస్.

"బాగున్నాను సార్!" అన్నాను.

"బాగా రెస్ట్ తీసుకున్నావా?"

"ఆс!"

"ఈదినం కొద్దిగా పనుంది. అవసరంగా ఒకమారు వచ్చి పోగలవా?"

"మధ్యాహ్నం వస్తాను" అన్నాను.

"థాంక్స్! మూడింటికిరా చాలు!" అన్నాడు ఖాన్.

"అలాగే!" అని ఫోన్ కట్ చేశాను.

నా మనస్సునిండా షాలినే నిండుకుంది. అంతకుముందే నేను చాలామంది ఆడవాళ్లను చూశాను. కానీ ఎవ్వరూ నన్నిలా మత్తెక్కించలేదు.

మధ్యాహ్నం మూడింటికల్లా ఆఫీసులో అడుగుపెట్టాను. తిన్నగా వెళ్ళి ఖాన్ గారి గదిలో ఆయనముందు కూర్చున్నాను.

"వస్తానన్న టయిమ్‌కు వచ్చావ్! థాంక్స్!" అన్నాడు ఖాన్.

"దటీజ్ డ్యూటీ! ఇంతకూ ఏమైనా అర్జెంట్ సేల్ వుందా?" అడిగాను.

"సేల్ కాదు! పర్చేజ్. మహారాణి సావిత్రీదేవి గుర్తుందా నీకు" అడిగాడు ఖాన్.

"ఓ! ఆమెనెలా మరచిపోతాను. మనం కంపెనీ పెట్టాక చేసిన పెద్ద అమ్మకం ఆమెదేగా. ఆమెకు కావలసిన వజ్రాలకోసం ముప్ఫయి దేశాలుకూడా తిరిగొచ్చానుగా."

"ఆవిడ నిన్న వచ్చింది. మనం ఆవిడకు అమ్మిన వజ్రాల నెక్లెసు వెంటనే ఎవరికన్నా అమ్మిపెట్టమంది. ఎవ్వరికీ తను అమ్మిన విషయం-ముఖ్యంగా తన భర్తకి తెలియగూడదని చెప్పింది."

"ఎందుకని."

"రేసుల్లో, పేకాటలో, త్రాగుడు పార్టీలలో గత రెండేళ్ళలో ఆమెకు చాలా లక్షలు అప్పయిందని నేను విన్నాను. ఆ డబ్బంతా విపరీతమైన వడ్డీలకు తెచ్చింది. అవన్నీ పాపంలా పెరిగాయి. అప్పులిచ్చినవాళ్ళు వెంటనే డబ్బిమ్మని, లేకుంటే ఆమె భర్తకు చెప్తామని బెదిరిస్తున్నారట. దాంతో ఆమె భయపడిపోయింది. నా దగ్గర

కొచ్చింది. ఎలాగైనా అమ్మిపెట్టమని చెప్పింది. ఈ దినం రాత్రిలోగా డబ్బు కావాలంది. వీలులేదన్నాను. కనీసం రేపు సాయంత్రంలోగానన్నా డబ్బిమ్మని అడిగింది. నీతో ఆలోచించి ఫోన్ చేస్తానని చెప్పాను” అన్నాడు ఖాన్.

ఆ నెక్లెసును అప్పట్లో ముప్ఫయి లక్షల రూపాయలు పెట్టి కొనింది. నేను దేశాలు తిరిగిన ఖర్చులన్నీ ఆవిడే భరించింది. అంత ఖరీదైన నెక్లెసు కొనేవాళ్ళు ఎప్పుడు పడితే అప్పుడు దొరకరు. ఆ నెక్లెస్ విలువ గుర్తురాగానే నా మెదడు పనిచెయ్యడం ప్రారంభించింది. చకచక ప్లానింగ్ జరిగిపోయింది నాలో. పాలిని గుర్తుకొచ్చింది. ఆమె మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

“దాన్ని అమ్మడం మాటలుకాదు. చాలా టయిమ్ పడుతుంది. అంతడబ్బు పెట్టికొనే మనిషికావాలి ముందు” అన్నాను.

“అవును. నువ్వే ఏదైనా మార్గం చెప్పు. ఆమె గంటకో మారు ఫోన్ చేసి నా ప్రాణాలు తోడేస్తోంది” అన్నాడు ఖాన్.

“ఆమెకు డబ్బు అవసరంగా ఉందంటున్నారు. మీరే ఎందుకు కొనగూడదు. సగంకన్నా తక్కువ ధరకు కొనవచ్చు. మనం దాన్ని విడగొట్టి వేరువేరు డిజైన్లలో ఒక సెట్ చేసి అమ్మితే నలభైలక్షలదాకా మిగులుతుంది. అంటే ముప్ఫయిలక్షలు ఆదాయం వస్తుంది. ఇంతకన్నా మంచి ఛాన్సు మనకు దొరకదు” అన్నాను.

ఖాన్ ఆలోచనలో పడ్డాడు.

“నువ్వు చెప్పేది బాగానేవుంది. కానీ అంతడబ్బు కంపెనీద్వారా పెడితే ఇన్‌కంటాక్సు వాళ్ళు నెత్తికెక్కుతారు. మనకు మిగిలేదేముంటుంది?” అడిగాడు ఖాన్.

“అందుకే మీ స్వంతడబ్బుతో కొనండి. ఏ గొడవా

వుండదు'' అన్నాను.

"ఆమె అంత సులభంగా అమ్ముతుందా?"

"ఆ సంగతి నాకు వదిలెయ్యండి. నేను వ్యవహారం చక్కబరుస్తాను."

"అయితే ఏడులక్షలకు సెటిల్ చెయ్యి. మళ్ళీ ఆమె ఇక్కడికొచ్చి ఏడవకుండా చూడు. నే నీలోగా డబ్బు ఏర్పాటు చేస్తాను. కానీ వీలయినంత త్వరలో తిరిగి అమ్మేసి మనం డబ్బు చేసుకోవాలి. వచ్చే ఆదాయంలో రెండుశాతం నీకు ఇస్తాను కమీషన్ గా'' అన్నాడు ఖాన్.

"అలాగే!'' అంటూ తలూపి వెలుపలికి వచ్చాను. కారెక్కాను. నా ప్లాను ప్రకారం దాదాపు ఇరవైలక్షలు లాభంవస్తాయి ఖాన్ కు. అందులో నాకు అతను ఇరవై వేలు ఇస్తానన్నాడు. కష్టం నాది. ఫలితం అతనిది. ఇలాగే నా తెలివిని అడ్డంగా పెట్టుకుని దోచుకొని లక్షలుకాదు కోట్లు ప్రోగుచేశాడు. ఈ దోపిడీని ఇంక జరుగనివ్వ దలచుకోలేదు.

బంగళానుండి మహారాణి సావిత్రీదేవికి ఫోన్ చేశాను. కింగ్స్ గాల్ఫ్ క్లబ్ కు సాయంత్రం ఆరు గంటలకు రమ్మందామె. ఆమె చెప్పినట్లే సరిగ్గా ఆరింటికల్లా అక్కడున్నాను. నన్ను చూడగానే దగ్గరకొచ్చింది.

"అలా వెళ్దాం!'' అంటూ దూరంగా చెట్లకేసి చూపించింది.

పచ్చికలో ఫర్లాంగుదూరం నడచి చెట్లక్రిందకు వెళ్లాం.

"ఖాన్ నిన్ను పంపాడా?'' అడిగింది సావిత్రీదేవి.

"ఆఁ!''

"అంతా చెప్పాడా?''

"చెప్పాడు."

"ఏదైనా పార్టీ వుందా?''

"లేదు! ఏవిధమైన ప్రచారం లేకుండా దాన్ని అమ్మడం అసాధ్యం. అంత ఖరీదైన వస్తువు కొనేందుకు డబ్బు సిద్ధంగా వున్నవాళ్ళు లేరు. కానీ నాకు తెలిసిన స్మగ్లర్ ఒకతను వున్నాడు. అతను కొంటాడు. కానీ మీరు పెట్టిన పెట్టుబడికూడా రాదు" అన్నాను.

"ఎంతకు కొంటాడు?"

"అతనితో మాట్లాడి వచ్చాను. ఆ నెక్లెసు గురించి అతనికి తెలుసట. అంత పెద్ద వస్తువులతో ఎప్పుడూ వ్యాపారం చెయ్యలేదన్నాడు. పదిలక్షలకుమించి ఒక్క పైసాకూడా ఇవ్వలేనన్నాడు."

"ఇది అమ్మకంకాదు. దోపిడి!"

"అందుకే నాకు ఇష్టంలేదని చెప్పాను. ఆ విషయం చెప్పిపోదామని వచ్చాను."

"ఖాన్‌తో చెప్పావా?"

"చెప్పాను."

"అతనేమన్నాడు?"

"నాతో ఏకీభవించాడు!"

"ఇది మోసం. ఆరోజు కొనేటప్పుడు ఎప్పుడు కావాలంటే అప్పుడు అమ్మవచ్చునన్నారు. ఐదారు లక్షల లాభంకూడా వస్తుందన్నారు. ఇప్పుడిలా మాట్లాడుతున్నారు" అంది విసుక్కుంటూ.

"మోసంలేదు మేడమ్! ఇప్పుడైనా మీరు బాహాటంగా అమ్మగలిగితే చెప్పండి, దేశమంతా తిరిగి ఎవరినన్నా పడతాను" అన్నాను.

"నో! దటీజ్ ఇంపాజిబుల్. ఈ విషయం నా భర్తకు తెలిస్తే కాల్చి చంపేస్తాడు."

"తర్వాతయినా తెలుస్తుందిగా! అప్పుడుమాత్రం చంపకుండా వదిలేస్తాడా?"

"నా దగ్గరే వుందని చెప్తాను. చూపించమని అడిగే ప్రసక్తేలేదు" అంది సావిత్రీదేవి.

"ఇలా ఎవ్వరికీ తెలీకుండా అమ్మాలంటే నేను చెప్పిన దానికన్నా ఎక్కువ డబ్బురాదు. అతను ఎనిమిది లక్షలకు పైన ఇవ్వనన్నాడు. నేనే అతన్ని బ్రతిమాలి ఒప్పించాను" అన్నాను.

ఆమె కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

"నేను ఎలాంటి పరిస్థితుల్లో చిక్కుకున్నానో తెలుసుకుని లూట్ చేస్తున్నారు. కానివ్వండి. డబ్బు ఈ రాత్రికి కావాలి!" అడిగింది.

"మీరు నెక్లెసు ఈ రాత్రికి ఇవ్వగలరా?"

"ఆఁ!"

"అయితే ఎక్కడ కలుసుకుందాం!"

"కాసినో సినిమాకు రా! సెకండ్ షోకే వస్తాను. అక్కడే వ్యవహారం సెటిల్ చేసుకుందాం!" అంది సావిత్రీదేవి.

"అలాగే! వస్తాను" అన్నాను.

"మిస్టర్ కరణ్! నాదగ్గరున్న నెక్లెసు తయారుచేసే ముందు అలాంటిదే గాజుతో డిజైన్ చేసిన మరో నెక్లెసు చూపించావు గుర్తుందా?" అడిగింది సావిత్రీదేవి.

"గుర్తుంది!"

"నాకది కావాలి! దాని ఖరీదు తగ్గించుకొని మిగిలిన డబ్బివ్వు!" అంది.

దాన్నామె గుర్తుచేశాకే నా ప్లాను మార్చుకున్నాను.

"సారీ! మేడమ్! దాన్ని అప్పుడే స్పాయిల్ చేశాం. మీ దగ్గరున్నది మరొకరి దగ్గర వుండగూడదని అలా చేశాం!" అన్నాను.

"ఆల్ రైట్! కాసినోలో సెకండ్ షోకు రా!" అంది.

నేను ఆమెవద్ద శెలవు తీసుకొని తిరిగి వచ్చేశాను. తిన్నగా ఇంటికి వెళ్ళి నా అల్మైరా తెరచి అందులోని సీక్రెట్ డ్రాయరు లాగిచూశాను. అందులో నకిలీ నెక్లెసు కనుపించింది. తీసి పైకెత్తి లైటువెలుగులో చూశాను. అది నకిలీదని గుర్తుపట్టడం చాలాకష్టం. తిరిగి దాన్ని సీక్రెట్ డ్రాయరులో వేసి తాళం వేశాను.

ఖాన్ ఇంటికి ఫోన్ చేశాను, వస్తున్నానని చెప్పేందుకు.

డ్రెస్ మార్చుకుని తిన్నగా ఖాన్ బంగళాకు వెళ్ళాను. అది చిన్న బంగళా. రోడ్ పైనే వుంటుంది. ఖాన్ కు పెళ్లి పెటాకులు లేవు. అందమైన అమ్మాయిల్ని అప్పటికప్పుడు కొనుక్కోవడం సరదా. ఇంట్లో ఒకేఒక సర్వెంట్ వున్నాడు. ఇంటిపని, వంటపని మొత్తం అతనే చూస్తాడు. నన్నతనికి బాగా తెలుసు.

నే వెళ్లేసరికి హాల్లో పచార్లు చేస్తున్నాడు ఖాన్.

ఇద్దరం కూర్చున్నాం.

సర్వెంట్ విస్కీ తెచ్చి ఇచ్చాడు.

గ్లాసందుకు నోటిదగ్గర పెట్టుకున్నాను.

"ఏమయింది? వెళ్ళినపని" అడిగాడు ఖాన్.

"అతికష్టంమైన పదిలక్షలకు ఒప్పించాను. రాత్రికి డబ్బిమ్మంది. మీరు రెండింటి లోపల డబ్బు సిద్ధం చెయ్యాలి" అన్నాను.

"సిద్ధంచేసేవుంచాను. కానీ ధర కాస్త తగ్గించవలసింది" అన్నాడు. అతని మాటలకు నాకు వొళ్ళుమండింది. ఆమెను పట్టపగలు నిలువు దోపిడీ చెయ్యడంగాక, ఇంకా ధర తగ్గించనందుకు నన్ను అతను తప్పు పట్టడం తలచుకొని వొళ్ళుమండింది. నాలుగూ అడిగి అక్కడే కడిగి పారేద్దామని అనుకున్నాను. అయినా తమాయించు

కున్నాను.

లోనికివెళ్ళి చిన్న బ్రౌండ్ కేస్ తెచ్చాడు. దాన్నిండా వెయ్యిరూపాయల నోట్లున్నాయి. అన్నీ కొత్తవే.

"మొత్తం పదిలక్షలు! డబ్బిచ్చేదాకా ధర తగ్గించేందుకు అవకాశం వుందిగా. ప్రయత్నించిచూడు" అన్నాడు మళ్ళీ ఖాన్.

"అలాగే!" అన్నాను.

"నెక్లెస్ తీసుకుని తిన్నగా ఇక్కడికొచ్చెయ్యి. నా పేరుమీదే రశీదు తీసుకో" అన్నాడు ఖాన్.

"అలాగే!" అన్నాను బ్రౌండ్ కేస్ తీసుకొని లేచి నిలుచుంటూ.

6

పన్నెండూ పదిహేనుకు కారెక్కి స్టార్టుచేశాను. గేటు దాటబోయేంతలో ఎదురుగా పాత మోడల్ ఫోర్డు కారు అడ్డంగా కనుపించింది.

బోనెట్ ముందు సిగరెట్ కాలుస్తూ నిలుచున్నాడు కిశోర్ సింగ్. లోపల నలుగురైదుగురు వున్నట్లుగా తోచింది. నాచేత పొందిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోనేందుకు సిదపడి వచ్చారని తెలుసుకోనేందుకు పెద్ద ఊహ, ఆలోచన అవసరం లేకపోయింది.

వాళ్ళతో తలపడటానికి అది సరయిన సమయంకాదు. నా కోసం కేసినోలో సావిత్రీదేవి కాచుకుని వుంటుంది. నా దగ్గరేమో పదిలక్షల రూపాయలు క్యాష్‌వుంది. అంత డబ్బు వాళ్ళ కళ్ళబడిందంటే నన్ను ముక్కలు ముక్కలుగా నరికి పారేసేటందుకూ్కడా వెనుకాడరు.

డాష్‌బోర్డులో ఎడంచెయ్యి పెట్టి, రివాల్వరు తీసుకున్నాను. దాన్ని కుడిచేతిలోకి మార్చుకొని, డ్రైవింగ్

వీల్ ను ఎడంచేత్తో పట్టుకున్నాను. ఇంజన్ ఆన్ చేసి వుంచాను.

కిశోర్ సింగ్ మాత్రం ధైర్యంగా అక్కడే నిలబడి వున్నాడు. ఆ కారును తప్పుకుని వెళ్ళే మార్గంలేదు. రివాల్వరు పేలుస్తూనే కారును రివర్స్ చేసి బంగళాలోనికి పోనిచ్చాను. రివాల్వరు చేత్తో పుచ్చుకునే ఒక్క వుదుటున ఇంట్లో దూరాను. తలుపులు మూసుకున్నాను.

టెలిఫోన్ డయల్ చేసి నా అడ్రసు చెప్పి పెద్ద ఫైర్ ఆక్సిడెంటయిందనీ, వెంటనే హెల్ప్ పంపమని చెప్పాను. ఆ తర్వాత పోలీస్ లకుకూడా ఫోన్ చేశాను ఫైరాక్సిడెంటయిందని. మేడపైకి వెళ్ళి గోడ్ వైపు చూశాను. రోడ్ కు అడ్డంగా కారుమాత్రం వుంది. కిశోర్ గానీ, అతని అనుచరులుగానీ నాకు కనుపించలేదు. నన్ను వల్లో వేశామన్న తృప్తితో, బంగళాలోకి వచ్చి వుంటారనుకున్నాను.

మెయిన్ డోర్ పగలగొట్టి రావచ్చు. కానీ అది కష్టం. అంతకు ముందొచ్చినట్లు, డ్రెయిన్ వాటర్ పైప్ పట్టుకొని పైకిరావచ్చు. నేను బెడ్ రూం తలుపులు బిగించుకొని కిటికీగుండా చూడసాగాను. ఎవరన్నా ఆ పైప్ పట్టుకొని పైకిరావాలనే ప్రయత్నంచేస్తే, కాల్చి పారేద్దామని నిర్ణయించుకుని ఎదురు చూడసాగాను.

ఫైర్ ఇంజన్లు, పోలీస్ వాన్లు వచ్చేందుకు పదిహేను నిముషాలు పడుతుంది. అంతదాకా నన్ను రక్షించుకుంటే చాలు. ఆ తర్వాత కిశోర్ తన్నుతను రక్షించుకునేందుకు పలాయన మంత్రం చిత్తగించాలి.

గంట చూసుకున్నాను. పన్నెండు నలభై అయిదు అవుతోంది. మరో పదిహేను నిముషాల్లో సినిమా వదులుతారు. ఆ టయిమ్ కు నేను అక్కడుండాలి. అది వీలవుతుందో కాదోనని ఆలోచించసాగాను. ఎందుకయినా

మంచిదని కాసినో థియేటరు మానేజర్‌కు ఫోన్ చేసి, బాక్సులో వున్న రాణీ సావిత్రీదేవితో అర్జంటుగా ఒక నిమిషం మాట్లాడాలని చెప్పాను.

అతను ఆడియన్సుని డిస్టర్బు చెయ్యడం తమకుఅలవాటు లేదన్నాడు. అంత అవసరమయిన విషయమేదన్నా వుంటే తనతో చెప్తే, షో వదిలాక చెప్తానన్నాడు. అదన్నా నయమనుకొని, నా పేరు చెప్పి, కొద్దిగా ఆలస్యంగా వస్తాననీ, వచ్చిందాకా అక్కడే వెయిట్ చెయ్యమనీ ఆవిడకు చెప్పమన్నాను. అతను సరేనన్నాడు. థాంక్స్ చెప్పి, ఫోన్ కట్ చేశాను.

ఫైరింజను శబ్దం వినిపించింది. రెండు క్షణాల్లో పోలీస్ పాట్రోల్ కార్ సైరన్ కూడా వినపడింది. నా ఇంటి కాంపౌండ్‌లోంచి పిచ్చికుక్కల్లా పరుగెత్తిపోతున్న కిశోర్ సింగ్‌నూ, అతని అనుచరుల్ని చూశాను. కారక్కడే వదిలేశారు. దాన్ని అడ్డం తొలగించి, నా బంగళాలోకి రావాలి పోలీసులు. ఫైర్ సర్వీస్ వాళ్ళు వాళ్ళను కలుసుకొని, ప్రశ్నలకు జవాబులు చెపుతూ నిలుచుకోవడం నా కిష్టం లేకపోయింది. అందుకుని, డ్రెయిన్ పైపు పట్టుకొని వెలుపలకు జారాను. గోడదూకి రోడ్ చేరి, ఎవ్వరికీ కనుపడకుండా జంక్షనుకొచ్చి టాక్సీ ఎక్కాను. స్టార్టుకాగానే 'కాసినో' అన్నాను.

టాక్సీ నిర్మానుష్యంగా వున్న రోడ్ మీద జోరుగా పోసాగింది. పన్నెండు నిముషాల్లో థియేటరు చేరుకున్నాను. అక్కడంతా నిశ్శబ్దంగా వుంది. లైట్లన్నీ ఆర్పివేసి వున్నాయి. రోడ్‌లో మాత్రం పెద్ద క్రిజ్లర్ కారు కనుపించింది. అదే సావిత్రీదేవి కారు. టాక్సీని కొంచెం దూరంలో ఆపి డబ్బిచ్చి దిగాను. అది కదిలి కనుమరుగయిపోయాక కారు దగ్గరకు నడిచాను.

"సారీ! మిమ్మల్ని వెయిటింగ్‌లో వుంచాను" అన్నాను.

బ్యాక్ డోర్ తెరచుకొంది. ఒక మూలగా నొదుగుకుని కూచునివుంది సావిత్రీదేవి. నేనుకూడా ఎక్కి కూర్చున్నాను. ఆమె కాలితో ఏదో బటన్ నొక్కింది. ముందు డ్రయివరుకు, మాకు మధ్య అడ్డు తెరలాంటి దేదో పడింది. అలాంటి ఏర్పాటు కార్లలో వుండటం చూడటం నాకదే మొదటిసారి.

"తెచ్చావా?" అడిగింది మెల్లగా సావిత్రీదేవి.

"మీరు తెచ్చారా?" అడిగాను నేను.

"ఆc!" అంది జాకెట్‌లో చెయ్యి పెడుతూ. బహుశా ఆ బంగారు కొండల నడుమవున్న లోయలో దాచివుంచి వుండాలనుకున్నాను. వెంటనే చెయ్యి వెలుపలికి లాగింది. మిలమిల మెరిశాయి వజ్రాలు. నెక్లెసు నా కందించింది. చూశాను. బ్రాండ్ కేస్ తెరచి నోట్లకట్టలు ఇచ్చాను.

"థాంక్స్! ఆ కేస్‌కూడా ఇవ్వు. నిదానంగా పంపుతాను" అంది ఆమె.

"అలాగే!" అంటూనే నెక్లెసు జేబులో పెట్టుకొన్నాను.

అంతకుముందే టైపుచేసి వుంచిన రశీదును ఆమెముందు పెట్టి సంతకం చెయ్యమని పెన్నుతీసి అందించాను. బ్రాండ్ కేస్ వొత్తు పెట్టుకుని సంతకం చేసింది. ఆ రశీదుతీసి జేబులో పెట్టుకొన్నాను.

కారు కర్జన్‌రోడ్ దాపులకు రాగానే ఆపమని, దిగేశాను. కారు వెళ్ళిపోయింది. పాలిని ఇల్లు అక్కడకు దగ్గర్లోనే వుంది. అయినా అంత ఖరీదైన నెక్లెసు దగ్గరుండగా ఆమెవద్దకు పోవటం ఎందుకో మంచిదికాదని పించింది. కొంతదూరం ముందుకు నడచి ఖాళీగా ఎదు

రొచ్చిన టాక్సీ ఆపి ఎక్కాను. అడ్రసు చెప్పి పోనిమ్మన్నాను. నేను ఇల్లువదలి ఎంత సేపయి వుంటుందో చూద్దామని వాచీకేసి చూశాను. ఒకటే యాభై అయింది. అంటే నలభై నిముషాలయి వుండాలనుకున్నాను.

నేను ఇంటిముందు కొచ్చేసరికి రోడ్ అంతా నిర్మానుష్యంగా వుంది. ఫోర్డుకారు కూడా లేదు. అంటే దాన్ని పోలీసులు లాక్కుపోయి వుండాలి అనుకున్నాను.

ఇంటిముందు దిగి టాక్సీవాలాకు డబ్బిచ్చి లోనికి నడిచాను. పోర్టికోలో కూచుని బీడి త్రాగుతున్న పోలీస్ జవాను కనుపించాడు.

నన్ను చూడగానే లేచి "ఎవరు" అన్నాడు.

"నేనే! ఈ ఇల్లు నాది. నువ్వెందుకున్నావ్?" అడిగాను.

"మీరు రాగానే వెంట బెట్టుకుని తీసుకురమ్మని మా ఇన్‌స్పెక్టర్ గారు నన్ను ఇక్కడ వదలి వెళ్ళారు. వెళ్దాం రండి!" అన్నాడు పోలీసు జవాను.

"ఎందుకు? ఏం జరిగింది?" అడిగాను.

"నాకు తెలీదు సార్!" అన్నాడు అతను.

చేసేదిలేక అతనివెంట నడచాను.

ఇన్‌స్పెక్టర్ని వదలించుకుని తిరిగి రావడానికి రెండు గంటలు పట్టింది. రకరకాల ప్రశ్నలు వేశారు. అతని మనస్సులో వున్న అనుమాన మేమిటో నా కర్థంకాలేదు. కారుండగా, దాన్ని ఇంట్లోనే వదలి, టాక్సీలో వెలుపలకు ఎందుకు వెళ్ళావన్నాడు. ఏదో చెప్పాను. నా కారుని ఒంటిగంట ప్రాంతంలో తాను తాకిచూశాననీ, బానెట్ వేడిగా వుందనీ, ఎవరో వాడారనీ చెప్పాడు. నేను ఒప్పుకోలేదు. ఎలాగో వదలించుకున్నా నతన్ని. నాకు కశోక్ సింగ్ గురించి తెలీలేదు. ఇన్‌స్పెక్టర్ చెప్తాడేమో

నని ఎదురుచూశాను. అతను ఆ ప్రశంస తేలేదు.

గార్డెన్ లోని డ్రాయరు తెరచాను. మంచి నెక్లెసు అందులో పెట్టి తాళంవేసి, నకిలీ నెక్లెసు తీసి పాంటు జేబులో పెట్టుకొన్నాను ప్రొద్దున్నే ఖాన్ మొహాన పారేసేందుకు.

గ్లాసునిండా విస్కీ పోసుకుని త్రాగి లైటార్పి పడుకున్నాను.

7

తెల్లారి పదకొండు గంటలకు మెలకువ వచ్చింది. స్నానం చేసి డ్రెస్ చేసుకొని, కార్లో బయలుదేరాను. ఖాన్ కు నెక్లెస్, రశీదు ఇచ్చాను. అందుకుంటూ నాకేసి ఆనందంగా చూశాడు.

"గ్లాడ్! మన ప్లాన్ సగం సక్సెస్. మిగిలింది కూడా సక్సెస్ చెయ్యాలి!" అన్నాడు ఖాన్.

"డెఫినెట్ గా! మీరు నిశ్చింతగా వుండండి" అన్నాను.

"నిన్ను నమ్ముకునే దిగా నీ వ్యవహారంలో" అన్నాడు ఖాన్.

"ఈలోగా వాట్ని విడదీసి, వేరే డిజైనలో మంచి సెట్ గా తయారుచేసే ఏర్పాటు చూడండి. డిజైన్ సెలెక్టు చేశాక నాకోమారు చూపించండి" అన్నాను. ఖాన్ మంచి డిజైనర్.

"అలాగే!" అన్నాడు.

నా కక్కడ చేసే పనేమీ లేదు. అందువల్ల ఖాన్ తో చెప్పి వెలుపల కొచ్చాను. కారెక్కి తిన్నగా షాలిని ఇంటికి పోనిచ్చాను.

నే వెళ్ళేసరికి మంచానికి అడ్డంగా బోరగింతలా పడుకుని ఏవో 'న్యూడ్' ఫోటోల పుస్తకం తదేకంగా

చూస్తూంది. దగ్గాను. తలెత్తి చూసి లేచి కూచుంది.

"ఎలాగుంది ప్రేమ? తగ్గిందా? ఎక్కువైందా?" అడిగింది నవ్వుతూ.

"తగ్గడం ప్రశ్నే లేదు!" అన్నాను ఆమెకు కొంచెం దగ్గరగా కూర్చుంటూ.

"అయితే విషంలా ఎక్కుతూనే వుందన్నమాట!"

"అవును! కానీ నీకింకా నాపైన కోపం తగ్గినట్లులేదు. ఆ కిశోర్‌గాడు రాత్రి మళ్ళా ఇంటికొచ్చాడు. చంపేందుకు సిద్ధంగా వచ్చినట్లున్నాడు" చెప్పాను.

"నో! నాకు తెలీదు!" అంది షాలిని.

"తెలిసినా నాకు బాధలేదు. జరిగింది చెప్పాను."

"ఎలా తప్పించుకున్నావ్?"

"తెలివంటూ వుండాలికానీ, వాడొక లెఖ్ఖా!" అన్నాను. షాలినితో పరిచయం లేకముందు అతనిలాంటి కిరాతకులకు ఆరు ఆమడల దూరంగా ఉండేవాణ్ణి.

"నా ప్రశ్నకిదికాదు జవాబు!"

"తెలుసు. ఆ జవాబు ఆ వెధవే చెబుతాడు. నీతో ఒక ముఖ్యమైన విషయం గురించి మాట్లాడాలని వచ్చాను" అన్నాను.

"ఏమిటది!"

"మనం పెళ్ళాడాలంటే డబ్బుకావాలి. పది పరకా కాదు. లక్షలు. అది న్యాయంగా సంపాదించాలంటే ఎన్నో ఏళ్ళు పడుతుంది. ఆలోగా మనం ఇద్దరం ముసలివాళ్ళమయిపోతాం. అందుకనే అడ్డదారులు వెతుకుతూండిపోయేను. ఒకదారి తెలిసింది. అయితే నీ సాయం కావాలి. వచ్చే మొత్తంలో చెరసగం తీసుకుందాం. నీ భాగం నీ స్వంతం. నీ ఇష్టమొచ్చినట్లు ఖర్చుచేసుకో. నా భాగం మాత్రం మనిద్దరికీని" అన్నాను.

"అసలు సంగతి అర్థమయ్యేట్లు చెప్పు" అంది షాలిని మోకాళ్ళచుట్టూ చేతులు వేసుకొని గడ్డం వాటిపైన ఆనించి చూస్తూ.

"రాంనగర్ రాణి సావిత్రీదేవి పేరు ఎప్పుడైనా విన్నావా?"

"విన్నాను."

"ఎప్పుడు!"

"ఆ మధ్య ఆమె దగ్గర ప్రపంచంలోకల్లా విలువైన వజ్రాల నెక్లెసు ఏదో వుందనీ, అది మెళ్ళో వేయించుకుని తీయించుకున్న ఫొటో పేపర్లలో వేశారు. దాన్ని చూశాను" అంది షాలిని.

"దాని విలువెంతో తెలుసా?"

"తెలీదు!"

"ముప్పయి లక్షలు. కాస్త ధైర్యం చేస్తే దాన్ని మనం సులభంగా దొంగిలించవచ్చు" అన్నాను.

"ఎలా? పట్టుబడితే పదేళ్ళు జైల్లో పడిచావాలి!" అంది షాలిని.

"అటువంటి ప్రమాదమేమీ లేదు. నీకు ధైర్యం వుంటే చెప్పు. దాన్ని మనం స్వంతం చేసుకుందాం. మెల్లగా ఒక్కొక్క వజ్రమే అమ్ముకుందాం. డబ్బు చేసుకుందాం" అన్నాను.

"నాకు ధైర్యమే! ఏం చేయాలో చెప్పు" అంది షాలిని.

"మీ అన్నయ్య ఎలాంటివాడు?"

"మధ్య అతని ప్రసక్తి ఎందుకు?"

"అవసరం వుంది కనుక అడిగాను. మీరిద్దరూ మారు వేషాల్లో ఎవరూ తిరిగి గుర్తుపట్టడానికి వీలు లేకుండా తయారు కావాలి. మీకు రెండు రివాల్వర్లిస్తాను.

వాటిలో గుండ్లు పెట్టనవసరం లేదు. నా స్తేనే నాలు జెరిగిపోయే మనిషితో మన వ్యవహారం నడవబోతుంది. ఎన్నిగంటలకు, ఎక్కడకు, ఎలా రావలసిందీ, ఎలా భయపెట్టవలసిందీ, ఆ నెక్లెసును ఎలా దొంగలించవలసిందీ, నీకు తర్వాత చెప్తాను. సరేనా?"

"అదిసరే! తీరా నెక్లెసు దొంగిలించుకొని వెళ్ళిపోతే నువ్వేం చేస్తావ్. నోట్లో వ్రేలు వేసుకోవలసిందే" అంది షాలిని.

"అంత వెధవను గాను. దాన్ని తీసుకుపోయి మీరేమీ చెయ్యలేరు. అందులోని చిన్నరాయి అమ్మజూసినా పోలీసుల దృష్టిలో పడి తిన్నగా జైలుకు పోతారు" అన్నాను.

"మరి నువ్వుపోవా?"

"నేను ఆ వ్యాపారంలో ఉన్నవాణ్ని. నన్నెవరూ అనుమానించరు. నాకు తెలిసినంతమంది గౌరవనీయులైన వ్యక్తులు, నల్లడబ్బుతో నగలు చేయించుకొనే మనుషులు మీకు తెలీదు. నా రహస్యం వాళ్ళ దగ్గరా, వాళ్ళ రహస్యం నాదగ్గరా క్షేమంగా వుంటాయి" అన్నాను నవ్వుతూ.

"ఆల్ రైట్! ప్లానంతా పూర్తిగా తయారుచేసి చెప్పు. ఈ దెబ్బతో మన దరిద్రం తీరిపోతుంది. హాయిగా ఏ అమెరికాకో వెళ్ళి బ్రతుకుదాం!"

"అలాగే. వస్తాను" అని అక్కణ్ణుంచి బయల్దేరాను.

ఆ తర్వాత రెండు రోజులు ఉదాసీనంగా, ఏవిధమైన సంఘటనా జరగకుండానే గడిచిపోయాయి. రెండుసార్లు మా బాస్ ఫోన్ చేసి నెక్లెసు అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తూండమని హెచ్చరించాడు. సరేనన్నాను.

మూడవరోజుకు నా మైండ్‌లో దొంగతనం చేసేందుకు ప్లాన్ పకడ్బందీగా తయారయింది. ఆరాత్రికే అమలు పరచాలని తీర్మానించుకొన్నాను. ప్రొద్దున్నే లేచి బజారు కెళ్ళి రెండు విగ్గులు, మెర్క్యురీ పూసిన సన్‌గ్లాసుల జతలు రెండూ, ఆడవాళ్ళు వేసుకునే సూటు, మగవాళ్ళు తొడుక్కునే కుర్తా షర్టూ, పాంటు, అన్నీ కొన్నాను. వాటిని టాక్సీలో పెట్టుకొని షాలిని ఇంటికి చేరాను.

నేవెళ్ళేసరికి డ్రెస్ చేసుకుంటూంది. నన్ను చూడగానే ఉత్సాహంగా వచ్చి కూర్చుంది ఎదురుగా.

"చెప్పండి! ఏమైంది?"

"ఏం కాలేదు! ఇవాళ రాత్రికే మనం పని పూర్తి చేయాలి. మీకోసం ఈ బట్టలు తెచ్చాను. ఇవి తొడుక్కుని విగ్గులు పెట్టుకుంటే ఎవ్వరూ గుర్తు పట్టరు. తెలిసిన వాళ్ళదగ్గరెక్కడన్నా టాక్సీ మాట్లాడుకోండి. మా బాస్ అడ్రస్ ఇది" అంటూ కాగితం అందించాను.

అందుకొని లోలోపలే చదువుకొంది షాలిని.

"అది చిన్న బంగళా. రోడ్ పైకి వుంటుంది. ఇంట్లో ఆయనొక్కడే వుంటుంటాడు. ఒక నౌకరు మాత్రం వున్నాడు. గేటు ఎప్పుడూ తీసి వుంటుంది. గేటు ప్రక్కనే వాడి గుడిసె వుంది. పిలిస్తే వాడే వచ్చి తలుపు తీస్తుంటాడు.

సరిగ్గా రాత్రి పదకొండు గంటలకల్లా మీరు అక్కడకు రావాలి. ఆ టైమ్‌కు నౌఖరు ఇంట్లో ఉండకుండా వెలుపలకు ఏదో పని చెప్పి పంపిస్తాను. మేము హాల్లోనే కూర్చుని వుంటాం. నెక్లెసు టేబుల్ పైన పెట్టివుంటుంది. ఇద్దరూ తుపాకులతో మమ్మల్ని బెదిరించండి. నేను మీ పైకి దుముకుతాను. నన్ను కొట్టండి. ఘట్టిగా కొట్టినా ఫరవాలేదు. నిజానికి కాస్త ఘట్టిగానే కొట్టండి. కాని

ఆయన్ను మాత్రం ఏమీ చేయవద్దు. నెక్లెసు లాక్కొని వెళ్ళిపోండి. మీ బట్టలు టాక్సీలోనే మార్చుకొని ఏ సెంటర్లోనో దిగేసి రిక్షా చేసుకొని ఇల్లు చేరుకోండి" అన్నాను.

"గుడ్! బాగుంది... మరి రివాల్వర్లు లేవే నా దగ్గర."

"తెచ్చాను." అంటూ రెండు తీసి అందించాను.

"ఒకటి నాది. రెండోది టాయ్ రివాల్వర్!"

షాలిని అందుకుని పరిశీలించి చూసింది. దేంట్లోనూ గుండ్లులేవు. బట్టలు, రివాల్వర్లు అన్నీ తీసి, గోడవారగా నున్న అల్మారాలో పెట్టి తిరిగి వచ్చి కూర్చుంది.

"ఈ నెక్లెసు నీకు ఎప్పుడివ్వాలి?" అడిగింది.

"నేనే వచ్చి తీసుకుంటాను. నన్ను కలుసుకునేందుకు నువ్వు ప్రయత్నం చెయ్యవద్దు. వీలు చూసుకొని వస్తాను. అంతదాకా ఓపిగ్గా ఉండాలి" అన్నాను.

"సరే! నా ఐ లైక్ యూ! యూ హావ్ గట్స్!" అంది గోముగా, మత్తెక్కిన కళ్ళతో నావైపు చూస్తూ షాలిని.

తక్కున ఆమెను బిగికౌగిట్లో బంధించి, పెదాలపైన ముద్దుల వర్షం కురిపించాను. కౌగిలి వదిలేసి ఆమెవైపు చూడకుండా వెళ్ళిపోయాను, ఇంకా వుంటే నా కోరికలు పిచ్చితల లెత్తుతాయన్న భయంతో.

అక్కడ్నుంచి ఆఫీసుకెళ్ళాను. ఖాన్ గార్ని కలిశాను. ఆయన నెక్లెసు గురించి గుర్తుచేసి "త్వరగా అమ్మాలి కరణ్! కొంత డబ్బు అప్పుకూడా తెచ్చి పెట్టాను" అన్నాడు.

"అలాగే బాస్! మీరేవైనా డిజైన్లు చూశారా వాట్ని సెట్ గా తయారు చేసేందుకు" అడిగాను ఆయనకు ఏవిధమైన అనుమానం రాకుండా వుండేందుకు.

"చూశాను. కానీ సరయినదేదీ దొరకడం లేదు!"

"మనిద్దరం కలసి ప్రయత్నం చేస్తే పని తొందరగా తెములుతుందేమో?"

"కరెక్ట్! నువ్వు ప్రక్కనుంటే ఉత్సాహంగా వుంటుంది."

"అయితే రాత్రి పదిన్నరకి వస్తాను. మీరు సెలెక్టు చేసిన డిజైన్లు చూపించండి. మనం చర్చించుకొని ఏదో ఒకటి ఫైనలైజ్ చేద్దాం!" అన్నాను.

"అలాగే! కాస్త ముందుగా రారాదు!"

"వచ్చేవాణ్ణి. ఒక పార్టీతో విషయం కదిపాను. అతను తొమ్మిదింటికి రమ్మన్నాడు. మీ ఇంటికీ, అతని బంగళాకు దాదాపు ఇరవై కిలోమీటర్లుంది. అందుకని. లేకుంటే నాకు పనేమీ లేదు" అన్నాను. ఆఫీసు ఎనిమిన్నరకు గాని మూయరు. అందాకా ఖాన్ వెలుపలకి రాలేడు. అందుకే అలా అబద్ధం చెప్పాను.

"అలాగే! నీ గురించి వెయిట్ చేస్తుంటాను" అన్నాడు ఖాన్.

"మీరు బెంగపడకండి! దాన్నమ్మడం పెద్ద పనికాదు. కాకుంటే కాస్త టైమ్ పడుతుంది. అంతే!" అంటూ తేలిగ్గా నవ్వేసి అక్కడ్నుంచి ఇల్లు చేరాను.

భోజనం చేసి ఫాన్ వేసి మంచంమీద పడుకున్నాను. కిశోర్‌సింగ్‌ను ఎదుర్కొన్నదీ, అతన్ని ముప్పతిప్పలు పెట్టిందీ, నెక్లెసు దొంగిలించింది, మాలినిని ప్రేమించిందీ నేనేనంటే నాకు నమ్మకం కలుగ లేదు. నాలో ఇంత పెద్ద కృత్రిమమైన, క్రూరమైన మార్పెలా వచ్చిందో అంతు చిక్కడంలేదు. అదంతా మాలిని మహిమే! ఆమె అందం కోసం అలమటించాను. పొందుకోసం మనస్సు తపించింది. ఆమె కళ్ళముందు హీరోలా కనుపించాలని ప్రయత్నిం

చాను. నేను పోతున్న దారి మంచిది కాదని తెలుస్తూనే వుంది. కానీ అంతదూరం వెళ్ళాక ఇక వెనక్కి వెళ్ళే మార్గంలేదు.

సరిగ్గా పది గంటలకు ఇంటిదగ్గర బయలుదేరాను. అసలు నెక్లెసు నా దగ్గరే వుంది. పోలిని నన్ను మోసం చెయ్యాలని ప్రయత్నించినా ఫలితంలేదు. నకిలీ నెక్లెస్‌తో తృప్తి పడాల్సిందే! నా మీద కే పరిస్థితుల్లోనూ నేరం రాదు.

8

ఖాన్ ఇంటిముందు కారాపి వాచీ చూసుకున్నాను. సరిగ్గా పదిన్నరయింది. దిగి లోనికి వెళ్ళాను. గుమ్మంలోనే ఎదురైనాడు ఖాన్.

“కంచనుగా చెప్పిన టైముకు వచ్చేశావే! ఏమైంది?” అడిగాడు.

“ఏది?”

“నువ్వెళ్ళిన పని?

“మాట్లాడాను. మనదోవకు లాక్కొచ్చాను. మళ్ళీ ఎల్లుండి కలవమన్నాడు. ఏవీ మీరు సెలెక్టుచేసిన డిజయిన్లు చూపించండ్” అన్నాను.

ఇద్దరం హాల్లో కూర్చున్నాం. టేబుల్ పైన నాలుగైదు బయిండుపుస్తకాలున్నాయి. దేశదేశాల్లోని నగల నమూనాలు అందులోవున్నాయి. అక్కడక్కడా గుర్తులు పెట్టి వున్నాయి పొడవుపాటి కాగితపుముక్కలతో.

ఒక్కొక్కటి తీసి చూడసాగాను. కావాలనే పరిశీలించి చూస్తున్నట్లు టైమ్ తీసుకొంటూ ఉండిపోయాను.

“ఆ నెక్లెసుకూడా తీసుకురండి! దాన్ని దగ్గర పెట్టుకొని వజ్రాల సైజులు చూసుకుంటూ, డిజైన్లతో వాట్ని

ఊహించుకుంటూ చూస్తే ఏది బాగుంటుందో తెలుస్తుంది" అన్నాను. నా ఉద్దేశ్యం షాలిని వచ్చాక దానికోసం ఆమె వెతుక్కోనవసరం వుండకూడదు. అది బల్లపై వుండాలి.

ఖాన్ లోనికి వెళ్ళాడు. కాలింగ్ బెల్ నొక్కాను. పనిమనిషి వచ్చాడు. పదిరూపాయల కాగితం ఇచ్చి రెండు గోల్డ్ ఫ్లాక్ సిగరెట్ పెట్టెలు, ఒక గోలీసోడా తెమ్మన్నాను. అతను వెళ్ళిపోయాడు. సిగరెట్లకొట్టు అర మైలు దూరంలోవుంది. ఆలోగా అంతా అయిపోవాలి.

ఖాన్ ఒక పెద్ద ఎర్రపెట్టె పట్టుకొచ్చి టేబుల్ పైన పెట్టాడు. మూతతీసి అందులోంచి పెద్ద ఎర్రకవరు తీసి విడిగా పెట్టాడు. దాని క్రిందనుండి నేనిచ్చిన నకిలీ నెక్లెసు తీసి టేబుల్ పైన మెల్లగా అమర్చాడు. పరిశీలిస్తూ కూర్చున్నాను.

దబదబమని బూట్ల చప్పుడయింది.

తలెత్తి చూశాను.

ఎదురుగా నేను కొని ఇచ్చిన దుస్తుల్లో, షాలిని, ఆమె వెంట మరోవ్యక్తి, ఆమె అన్నగారు ఇంకెవరో వున్నారు. రివాల్వర్లు మావైపు గురిపెట్టి చూస్తూ "హాండ్సప్!" అంటూ పెద్దగా అరిచారు.

నేను చేతులు పైకెత్తాను. కానీ ఖాన్ ఎత్తకుండా మగతనివేపు పరుగెత్తాడు నెక్లెసు చేతో పట్టుకొని. నేను చూస్తుండగానే ఖానును రివాల్వర్‌తో ధన్‌మని కాల్చి పారేశాడు. గుండ్లు గుండెలో దూరిపోయాయి. అమ్మో అని అరిచి పడిపోయాడు. నేను అతనివైపు దుమికాను. అతను నామీదకు దూకాడు. తలమీద ఏదో బలంగా పడింది. వీపు భాగం కుళ్ళబొడిచినట్లయింది. అంతే, ఆ తర్వాత ఏం జరిగిందో తెలీకుండాపోయింది.

9

మళ్ళీ స్పృహ తెలిసేసరికి, నా చుట్టూ కాలిబూట్ల మెత్తటి చప్పుడూ, గిరగిరమని మెల్లగా తిరుగుతున్న ఫాన్ సవ్వడీ, సీసాలు కదులుతున్న శబ్దం చూచాయగా వినిపించాయి.

"నర్స్! హౌ ఈజ్ ది పేషంట్!" అడుగుతున్నారెవరో.

"ఇంకా స్పృహ రాలేదు డాక్టర్!" చెప్పింది నర్సయి వుంటుందనుకున్నాను.

"బహుశా ఈదినం స్పృహ వస్తుంది. ఇది ఐదోరోజు కదూ!"

"అవును డాక్టర్."

"అతను కళ్లు తెరవగానే ముందు నన్ను పిలువు. ఆ పోలీసు ఆఫీసర్ను లోనికి రానివ్వకు" అన్నాడు డాక్టర్.

దాంతో నాకు పరిస్థితి అర్థమైంది. నాకోసం పోలీసులు సిద్ధంగా ఉన్నారన్నమాట. షాలిని ఏమయింది? ఆమె వెంట వచ్చింది ఆమె అన్న కాదు. కిశోర్ సింగ్. అంటే నన్ను రంకులాడి మోసం చేసింది. ఆమె ప్రేమలోపడి దారుణం చేసినందుకు నన్ను నేనే నిందించుకున్నాను. నాకు జీవితాన్నిచ్చిన ఖాన్ను చేతులారా నేనే బలి చేశాను. రివాల్వరులో గుండ్లుండ కూడదనీ, ఊరకే భయపెట్టాలని నేను చెప్పినా, నామాట వినకుండా, లోడెడ్ రివాల్వరు తెచ్చారు వాళ్ళు. తన్నే చంపాలని అనుకుని వుంటాడు కిశోర్. ఖాన్ ముందుగా కలియబడటంతో అతనిని హతం చేశాడు.

నెక్లెసు గుర్తువచ్చింది. అది నాగుపాములాంటిది. అదే వాళ్లను కాటువేస్తుంది. దానిని అమ్మజూపారంటే చిక్కిపోతారు. నాకు స్పృహవచ్చినట్లు పోలీసులకు తెలిసే

లోగా, ఏమేం జరిగిందీ తెలుసుకోవాలి నేను.

మెల్లగా కళ్లు తెరిచాను. గదంతా నిశ్శబ్దంగావుంది. ఫాన్ శబ్దంమాత్రం వినరాసాగింది. నర్స్ మెల్లగా లోనికొచ్చింది. నన్ను చూసి ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి.

"ఎలా వున్నారు?"

"బాగున్నాను."

"డాక్టర్ను పిల్చుకొస్తాను" అంటూ పోబోయింది.

"సిస్టర్! ఒక నిముషం!" అన్నాను.

ఆమె చటుక్కున ఆగి నాకేసి చూసింది. దగ్గరగా రమ్మని సైగ చేశాను.

"ఏమిటి?"

"నాకు సిస్టర్స్ లేరు. నువ్వే నా సిస్టరు వనుకుంటాను. నా గురించి నీకేం తెలుసో చెప్పాలి" అడిగాను దీనంగా.

"ఎవరో దొంగలు మిమ్మల్ని కొట్టి, మరెవరో ఒకతనిని చంపి ఏదో నెక్లెసు దొంగిలించారట. పోలీసులు మీతో మాట్లాడాలని సిద్ధంగా వున్నారు. అంతే!"

"ఆ దొంగలు పట్టుబడ్డారా?"

"లేదట. వాళ్లగురించి సరైన సమాచారం చెప్పేవాళ్లే లేరట" అంది నర్సు.

"థాంక్స్! డాక్టరును పంపండి!" అన్నాను ఆమె వైపు కృతజ్ఞతతో నిండిన చూపులుచూస్తూ. ఆమె వెళ్లిపోయింది. డాక్టర్ వొచ్చి ఇంజక్షనిచ్చి 'పోలీసాఫీసరు వచ్చాడు. అతనితో మాట్లాడే ఓపకుందా?' 'అడిగాడు.

"రమ్మనండి!" అన్నాను లేచి కూర్చుంటూ. రెండు నిముషాల తర్వాత ప్లెయిన్ డ్రెస్‌లోవున్న పొడవుపాటి వ్యక్తి వచ్చాడు నా ముందుకు.

రాగానే నా పరిస్థితికి విచారం తెలిపాడు. తర్వాత

మొదలెట్టాడు పరిశోధన. అతని ప్రశ్నల్ని బట్టి, అప్పటికే వాళ్ళకు చాలా సమాచారం అందినట్లు అర్థం చేసుకొన్నాను. దొంగల్ని వర్ణించమని అడిగాడు. నేను చూచింది చెప్పాను. విన్నాడు.

నవ్వుతూ "అలాంటి బట్టలు నువ్వు కథియావాక్ డ్రెసెస్‌లో కొన్నట్లు సాక్ష్యం వుంది" అన్నాడు.

"నేనా? ఇంపాజిబుల్."

"ఆ షాపతను చెప్పాడు. నీ దగ్గర నే వో మారు వజ్రాల వుంగరం కొనేందుకు వచ్చాడట."

"పొరపాటు పడివుంటాడు."

"నీ మెర్సిడెస్ కారు కర్జన్ రోడ్ ప్రాంతాల్లో చాలా సార్లు కనుపించిందట. ఆ ప్రాంతాలుండేదంతా దొంగలు, రౌడీలు, తాగుబోతులు, వ్యభిచారిణులు. నీకు తెలిసిన వాళ్ళెవరైనా వున్నారా?"

"లేరు!" అన్నాను.

"మరి అక్కడేం పనివుంది నీకు."

"నేనెప్పుడూ వెళ్ళలేదు ఆ రోడ్డుకు."

"కిశోర్ సింగ్ అనే పెద్ద రౌడీనిగానీ, షాలిని అనే పిక్‌పాకెట్‌గానీ నీకు తెలుసా?"

"తెలీదు!"

"దొంగతనం పోయిన వజ్రాలహారం ఖరీదెంత వుంటుంది?"

"నెక్లెసు పోవడమేమిటి?"

"అసలు దానికోసమే ఖాన్‌ను హత్య చేశారు వాళ్ళు" అన్నాడు పోలీస్ ఆఫీసరు.

"నాన్సెన్స్! ఆరోజు మేము నకిలీ నెక్లెసు పెట్టుకొని చూసుకుంటూండిపోయాం. బహుశా. దానిని తీసుకుని వెళ్ళి వుండాలి. అసలుది నా ఇంట్లో దాచి వుంచమన్ని

ఇచ్చాడు ఖాన్. అక్కడది భద్రంగానే వుండాలి"
అన్నాను.

"రియల్లీ!" విస్తుపోతూ అడిగాడు.

"రియల్‌గానే!" అన్నాను.

అతను వెలుపలకి వెళ్ళిపోయాడు. ఐదునిముషాల్లో తిరిగొచ్చి "మీ ఇంటికి మా వాళ్లను రమ్మన్నాను. అది ఎక్కడ దాచారో చెప్పండి వెళ్లి వస్తాను" అన్నాడు.

అంతా చెప్పి, కోటుజేబులో వున్న తాళాలు తీసుకొని వెళ్ళమన్నాను. అతను వెళ్ళాడు. దీంతో నాపైనుండి వీళ్ల దృష్టి మూడొంతులు తిరిగిపోతుందనుకున్నాను.

కంపెనీ లాయర్ లోకనాథం వచ్చాడు. నన్ను చూసి విచారం వ్యక్తం చేశాడు. ఖాన్ గారు పోయినందుకు కంట తడిబెట్టాడు. నాకు మొదటిసారి కన్నీళ్ళు వచ్చాయి.

"ఏమిటి విశేషాలు?" అడిగాను.

"ఏం లేదు. ఖాన్ వీలునామా నా చేత రాయించి రిజిష్టరు చేశాడు. అతనికున్న మొత్తం ఆస్తి రెండు భాగాలు చేసి ఒక భాగం నీకూ, మరో భాగం, ఆఫ్ఘనిస్తాన్‌లో వున్న అతని తోబుట్టువుకు రాశాడు. అది చెప్దామని వచ్చాను" అన్నాడు.

వినగానే నా మతిపోయింది. సరైన కమీషన్ కూడా ఇచ్చేందుకు బేరాలాడే ఖాన్ సగం ఆస్తి నాకు రాయడం విచిత్రంగా తోచింది. ఆమాటే లోకనాథంతో అన్నాను. విని నవ్వి "నీపైన ఆయనకు పుత్రప్రేమ బాబూ! డబ్బు ఎక్కువ ఇస్తే పాడు చేస్తావని కాదు గానీ పాడైపోతావని భయపడ్డాడు. నీకు పెళ్లి చేసి నీతోనే వుండిపోవాలని తన కోరికని నాకు పదేపదే చెప్పేవాడు" అన్నాడు లోకనాథం.

కన్నతండ్రిని నాకు తెలీదు. అంతకన్నా ఎక్కువగా

అభిమానించిన ఖాన్‌ను నేనే చేజేతులా చంపించినందుకు నాపైన నాకు రోత పుట్టింది. ఆయనని పంపించేశాను. పిచ్చి పిచ్చిగా ఆలోచనలు చేస్తూ, క్షణక్షణానికి క్షమించమని ఖాన్‌ను వేడుకుంటూ, మరో మూడ్రోజులు ఆస్పత్రిలో గడిపాను. నెక్లెసు దొరకగానే పోలీసులు హంతకుల్ని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నన్నుకూడా రెండు మూడుసార్లు వచ్చి కలిశారు.

10

ఐదోరోజున డిస్చార్జయినాను.

తిన్నగా ఇంటికి వెళ్ళాను. లోపల కడుగుపెడుతుండగానే ఫోన్ మ్రోగింది. రిసీవరు అందుకున్నాను. "హల్లో కరణ్ స్పీకింగ్!" అన్నాను.

"ఇంటికొచ్చావా?" ఆ గొంతు కిశోర్‌ది.

"వచ్చాను" అన్నాను కూర్చుంటూ.

"ఆ నెక్లెసు నాదగ్గరుంది. ఎప్పుడొస్తావ్?"

"ఎందుకు?"

"అమ్మి పెట్టేందుకు?"

"రాను. రావలసిన అవసరం నాకు లేదు. ఖాన్ చని పోతూ విల్లు రాశాడు. అతని ఆస్తిలో సగం నాకొచ్చింది. దాని విలువ ఎంతో తెలుసా ఫ్రూల్. రెండుకోట్లు. ఆ నెక్లెస నువ్వే అమ్ముకో!" అన్నాను.

"నాకు చేతకాదు! నే చెప్పినట్లు వినకుంటే నిన్ను పోలీసులకు పట్టిస్తాను."

"ఏమని చెప్తావ్?"

"నీ రివాల్వరుతో నే హత్య చేశాను. అది నా దగ్గరుంది. నువ్వే నాకళ్ళముందే కాల్చి చంపావని, నేనూ పాలిని సాక్ష్యం చెప్తాం. ఆ స్త్రీలో వాటూ అర్జంటుగా దక్కించు

కోసేనందుకు నువ్వే చంపి వుంటావని కోర్టు నమ్ముతుంది. ఎలాగుంది ఐడియా?"

"బాగుంది," అన్నాను ఏదో ఆలోచించుకుంటూ. నాకు చావన్నా భయం లేదు. జైలంటే భయం లేదు. కాని కిశోర్, షాలిని మాత్రం తప్పించుకుని పోగూడదు.

"అయితే తప్పదంటావా?" అడిగాను.

"తప్పదు!" అన్నాడు కిశోర్.

"షాలిని ఎక్కడుంది?"

"నా దగ్గరేవుంది."

"అయితే నెక్లెస్ తీసుకుని రాత్రికి రండి మాట్లాడుకుందాం!" అన్నాను.

కిశోర్ సింగ్ పదింటికి వచ్చాడు, షాలినితో.

ముగ్గురం హాల్లో కూర్చున్నాం. నా పరిస్థితులు వివరించి చెప్పాను. వాళ్ళిద్దరి దగ్గరున్న నెక్లెసును పదిలక్షలకు కొనేట్లు తీర్మానం చేసుకొన్నాను. ఆ తర్వాత వాళ్ళిద్దరూ నా జీవితంలోకి రాకుండా వుండేందుకు ఒప్పుకొన్నారు.

ఇద్దరికీ చెక్కు రాసిస్తానన్నాను. కాష్ కావాలన్నారు. ఐతే తెల్లారాక తెచ్చిస్తానన్నాను.

మాకు కుదిరిన అగ్రిమెంటుకు అందరం ఆనందించాం. కిశోర్ సింగ్ నన్ను సెలబ్రేట్ చెయ్యమన్నాడు. సరే నన్నాను. లేచివెళ్ళి బార్ లోంచి విస్కీ సీసా, సోడా, గ్లాసులు తెచ్చి అక్కడ పెట్టాను. ముగ్గురికీ విస్కీ పోసి సోడాతో కలిపాను. ఐస్ గడ్డలు అందులో వేశాను.

"ఛీర్స్" అనుకొని తాగటం మొదలెట్టాం.

నా ముప్ఫయి ఆరేళ్ళ జీవితంలో దాదాపు పదహారు సంవత్సరాలుగా విస్కీ త్రాగడం అలవాటు. నాకు ఎప్పుడూ అంత రుచిగా కనుపించలేదు. విషం అంత తియ్యగా వుంటుందని నాకు తెలీదు. ఆ విషం తీపిదిగాదు.

నేను సంతోషంతో చేస్తున్న పనికి సంబంధించింది. రెండు నిముషాలకు నాకేం కనుపించలేదు. షాలిని. కిశోర్ సింగ్ అంతకుముందే తలలు వాల్చేశాయి.

ఖాన్‌కు మనస్సులో నమస్కారం చేశాను. అంతే! ఆపైన నాకు తెలిసిందేమీ లేదు!

—: ఐపోయింది :—